PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

శనివారం 16-05-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 254 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

## మూడో దశ ఎస్ఐఆర్.. ఏపీ, తెలంగాణలో ఎప్పుడంటే..?




మిగతావి 2లో

## ఎన్నికల అనంతరం హింసపై విచారణ..

### నల్లకోటులో హైకోర్టుకు మమత



మిగతావి 2లో

## మెట్రోలో ప్రయాణించిన ఉబర్ సీఈఓ..

### అద్భుతం అంటూ ప్రశంసలు



మిగతావి 2లో

ఉబర్ సీఈఓ దారా ఖోస్రోషాహి ఇటీవల భారత్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దిల్లీ మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో ప్రయాణం అద్భుతంగా ఉందంటూ ఆయన ఓ వీడియోను పంచుకున్నారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ అవుతోంది.

## సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకం

- తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు
- మహిళా శక్తికి ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆదేశంపై స్పందించిన సింగరేణి
- వివిధ క్లిష్టతర బాధ్యతల నిర్వహణపై మహిళలకు అవకాశాలు
- హెవీ మోటార్ వెహికిల్ శిక్షణను పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు



"మహిళా శక్తికి గుర్తింపు ఇవ్వడం అన్ని రంగాల్లో ఎంతో అవసరం. మా ప్రభుత్వం లక్ష్యం అదే."




దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (రాజజూ) మహిళా సాధికారతలో కీలక ముందడుగు వేసింది. ఇప్పటివరకు పురుషులే నిర్వహించిన భారీ డంపర్ నిర్వాహణ బాధ్యతలను మహిళలకు అప్పగిస్తూ చరిత్ర సృష్టించింది.

### మహిళా శక్తికి గుర్తింపు

తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు సింగరేణి ఈ కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా కార్మికుల నైపుణ్యాన్ని గుర్తిస్తూ వారికి భారీ వాహనాల నిర్వహణలో అవకాశాలు కల్పిస్తోంది.



### సురక్షితంగా.. సమర్థంగా..

మహిళా డంపర్ ఆపరేటర్లకు అత్యాధునిక భద్రతా పరిజ్ఞానం, ప్రత్యేక మార్గదర్శకాలు అందించబడ్డాయి.

### మహిళలకు విస్తృత అవకాశాలు

- భారీ డంపర్ నిర్వహణలో మహిళలకు శిక్షణ
- క్లిష్టతర, సాంకేతిక బాధ్యతల నిర్వహణకు అవకాశం
- మహిళా కార్మికుల భాగస్వామ్యంతో సంస్థలో వైవిధ్యం
- ఆధునిక శిక్షణ, సురక్షిత వాతావరణంలో మహిళలకు మెరుగైన అవకాశాలు

### 13 మంది మహిళా ఉద్యోగులు శిక్షణ పూర్తి

సింగరేణి నిర్వహించిన హెవీ మోటార్ వెహికిల్ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు భారీ డంపర్లను నడపడానికి సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా సంస్థ అధికారులు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



"సింగరేణిలో మహిళల భాగస్వామ్యం పెరగడం మా సంస్థకు గర్వకారణం. వారి నైపుణ్యం, కృషి సంస్థ విజయానికి మరింత బలం ఇస్తుంది" అని సింగరేణి యాజమాన్యం పేర్కొంది.

మహిళా శక్తి.. సింగరేణి భవిష్యత్తు | సమానత్వం • సాధికారత • అభివృద్ధి | సింగరేణి.. దేశానికి శక్తి



## చదువుతోనే సమాజంలో మార్పు: మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి పట్టణం: చదువుతోనే సమాజంలో మార్పు వస్తుందని, ప్రతి ఇల్లు ఓ గ్రంథాలయం కావాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంపై నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తు భవనాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్, కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మంత్రి ప్రారంభించారు. సాంస్కృతిక శాఖ ద్వారా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో పుస్తక కేంద్రం ఏర్పాటు చేసి రూ.10 లక్షల విలువైన పుస్తకాలు కొనుగోలు చేస్తానని మంత్రి జూపల్లి తెలిపారు.

## తితిదే ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.1.51 కోట్ల విరాళం



2లో..

## కెటిఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషన్ భేటీ

### కీలక అంశాలపై ఇరు నేతల చర్చలు

మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుని భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ కలిశారు. నందినగర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీతో సమావేశం అయ్యారు. పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు.



2లో..

## చివరిగింజ వరకు కొంటాం

### రూతులకు మంత్రి ఉత్తమ్ హామీ

### పొంగులేటితో కలసి పాలేరు ధాన్యం కనుగోళ్ల పరిశీలన



2లో..

## వాహనశ్రేణి కుదించుకోవాలని

### మంత్రి లోకేశ్ నిర్ణయం



- వాహనశ్రేణి కుదించుకోవాలని మంత్రి లోకేశ్ నిర్ణయం
- కాన్వాయ్‌ను సగానికి తగ్గించాలని భద్రతా సిబ్బందికి ఆదేశాలు
- ఇకపై లోకేశ్ కాన్వాయ్ రెండు వాహనాలకే పరిమితం
- జడ్ కేటగిరి భద్రత ఉన్నప్పటికీ సరళతకు ప్రాధాన్యం
- సీఎం క్యాంపు కార్యాలయంలో అల్పాహార విందుకు మంత్రుల హాజరు
- పలువురు మంత్రులు ఒక్కో వాహనంలోనే కార్యక్రమానికి చేరిక

2లో..

## తీవ్ర విషాదం..



### పెళ్లిదండలతోనే నవ వధువు మృతి..

పెళ్లి సందడితో కళకళలాడిన ఆ కుటుంబాల్లో ఒక్కసారిగా తీవ్ర విషాదం నెలకొంది.



2లో..

# సంపాదకీయం

## మారిన రాజకీయం.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ఇరవయ్యవ శతాబ్దం మొదటి ఐదు దశాబ్దాలు రెండు ప్రపంచ యుద్ధాలు, వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమాలు చరిత్రను చాలా మలుపులు తిప్పాయి. మన దేశం కూడా ఆ చరిత్రలో భాగమే. గత ఎనిమిది దశాబ్దాలుగా భారతదేశంలో రాజ్యాంగం ఆధారిత ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో ఉంది. స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో వచ్చిన కొన్ని నవలల్లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది అని భావోద్వేగంతో ఒక మధ్యతరగతి ఒక పేదవాడికి చెపితే, "అయితే ఏమవుతుంది?" అని అమాయకంగా అడగడం మనోహర్ మలగాంకర్ తన 'బెండ్ ఇన్ గాంజెస్' అనే నవలలో రాశాడు. మన ప్రాంతంలో చాలా చర్చకు వచ్చిన కన్యాశుల్కంలోని జట్కావాడు... "భారతదేశానికి స్వాతంత్ర్యం రాబోతున్నది" అని గిరీశం అంటే-- "మన ఊరిలోని హెడ్ కానిస్టేబుల్ మారతాడా?" అన్న ప్రశ్న చాలా దూరదృష్టితో రాసిందే. సంభాషణ చాలా సాధారణమైనదిగా కనిపించినా బలప్రయోగం లేని ఒక రాజ్యం వస్తుందా అన్న పేదవాడి ప్రశ్న అప్పటికంటే ఇప్పుడు ఎక్కువ రెలవెంట్ అనిపిస్తుంది. ప్రజాస్వామ్యం అంటే రాజ్య బలప్రయోగం మీద నియంత్రణ.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం చాలా ఆటుపోట్లకు గురయ్యింది. చాలా మూడవ ప్రపంచ దేశాలలో ఈ మాత్రం ప్రజాస్వామ్యం కొద్దికాలమైనా నిలువలేకపోయింది. చాలా దేశాలు నియంతృత్వంలోకి, సైనిక పాలనలోకి వెళ్లిపోయాయి. మన దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగడానికి ఒక సమగ్రమైన రాజ్యాంగం తోడ్పడింది. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలకమైన పాత్ర నిర్వహించాడనే కీర్తి ఆయనకు దక్కింది. రాజ్యాంగం మీద దాడి పెరిగిన కొద్దీ అంబేద్కర్‌ను మననం చేసుకోవడం పెరుగుతున్నది. ఈ రాజ్యాంగంలోని ప్రాపంచిక దృక్పథం పెట్టుబడిదారీ ఆర్థిక నమూనాని ఒకవైపు అంగీకరిస్తూనే సోషలిస్టు సమాజ నిర్మాణం జరగాలని ఒక మధ్యేమార్గ ప్రయోగాన్ని వాగ్దానం చేసింది. ధనిక వర్గాలకి పెట్టుబడిదారీ పంథా, పేద వర్గాలకు సోషలిస్టు వ్యవస్థ అన్న ఒక మార్గం వేసే ప్రయత్నం చేసింది. దేశం ఎనిమిది దశాబ్దాలుగా ఒక చిక్కు మార్గంలోనే చిక్కుకుంది.

ఏ ప్రజాస్వామ్య వ్యవస్థ అయినా పేదల ప్రస్తావన లేకుండా, అసమానతల తగ్గింపు, అందరికీ అవకాశాలు, మనుషులంతా సమానమే అన్న భావన లేకుండా నిలువడం కష్టం. అందరూ సమానమే అన్న భావనను డా. అంబేద్కర్ చాలా దూరదృష్టితో, ఎన్నికలలో రాజకీయంగా మనం సమానత్వాన్ని కల్పించాం. ఒక మనిషి, ఒక ఓటు, ఒకే విలువ. ఈ సమానత్వం ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని సాధించకపోతే మనం ఎంతో కష్టపడి నిర్మించుకున్న ప్రజాస్వామ్య సౌధాన్ని ప్రజలు బద్దలుకొడతారు అని హెచ్చరిక చేశాడు. కానీ విచిత్రంగా సామాన్య ప్రజలు రాజ్యాంగాన్ని స్వంతం చేసుకుంటున్నారు, పాలకులు రాజ్యాంగం మీద దాడి చేస్తున్నారు.

ఎన్నికల రాజకీయాలలో రాజ్యాంగం కల్పించిన సమానత్వం డా. అంబేద్కర్ ఆశించిన సమానత్వ దిశలో కాక సమాజంలోని తీవ్ర అసమానతలు ఎన్నికలను నిర్దేశించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత ఎనిమిది దశాబ్దాలలో మొదటి రెండు దశాబ్దాలలో సోషలిస్టు నమూనా లాంటి వ్యవస్థ అన్న భావజాలం ప్రచారంలో ఉండేది. కానీ క్రమక్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడుతూ వచ్చింది. ఇందిరాగాంధీ నాయకత్వంలో ఈ వైరుధ్యం కొంత స్పష్టత పొంది సమాజంలోని అసంతృప్తి విభిన్న ఉద్యమాలకు దారితీసింది. ఈ అసంతృప్తిని గ్రహించిన ఇందిరాగాంధీ పేదరికాన్ని రాజకీయాలలో ఒక ప్రధాన అంశంగా ముందుకు తీసుకురావడంతో ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్లను సమీకరించుకోగలిగారు. ఆమె భావజాలం వల్ల ధనిక వర్గాల సమీకరణ బలపడడం, పేద వర్గాల ఆకాంక్షలు పెరగడం వల్ల వైరుధ్యాలు తీవ్రతరం కావడంతో సంక్షోభంలో చిక్కుకున్న ఇందిరాగాంధీ... రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులను రద్దు చేసి, అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భారతదేశంలోని 'రాజ్యాంగ ప్రజాస్వామ్యం' (కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రసీ) ఎంత బలహీనంగా ఉందో ఒక్కసారి బయటపడింది. ఏ కారణం వల్ల ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలు ప్రకటించిందో ఇప్పటికీ ఆ కారణాలు పూర్తిగా విశ్లేషించలేదు. ఆమె ఎన్నికలు ప్రకటించినప్పుడు జయప్రకాశ్ నారాయణ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, అరుణ్‌శౌరి కలిసి ప్రతిపక్షాలు ఏం చేయాలి అని చర్చించినప్పుడు అరుణ్‌శౌరి ఎన్నికలను బహిష్కరించాలి అని ప్రతిపాదిస్తూ... "నియంత ఎప్పుడూ తన విజయాన్ని గ్యారెంటీ చేసుకోకుండా ఎన్నికలకు వెళ్లరు" అని అంటే, "ప్రజలను మనం అంత తక్కువ అంచనా వేయకూడదు. సమాజం భయంలో ఉన్న మాట వాస్తవం. జనాన్ని మనం సమీకరించగలిగితే వ్యక్తులుగా భయపడుతున్న వాళ్లే సమిష్టిలో ధైర్యాన్ని కూడగట్టుకుంటారు. భయానికి మందు సమిష్టిలోనే ఉంది" అని జయప్రకాశ్ నారాయణ్ చెప్పారని అరుణ్‌శౌరి వ్యక్తిగత చర్చలో నాతో అన్నాడు. అటల్‌బిహారి వాజ్‌పాయ్ కూడా జేపీ వాదనతో అంగీకరించడంతో ఎన్నికలలో పాల్గొనాలనే నిర్ణయం తీసుకున్నామని అరుణ్‌శౌరి అన్నాడు.

ఎన్నికల రాజకీయ చరిత్రలో మనదేశంలో 1977లో మొదటిసారిగా ప్రజలు భయం నుంచి బయటపడి అధికార పార్టీనే కాక, వ్యక్తిగతంగా ఇందిరాగాంధీని కూడా ఓడించారు. అప్పటి వరకు బలమైన నాయకుడు లేదా నాయకత్వం కేంద్రంగా నడిచే రాజకీయాల స్థానంలో సమిష్టి నాయకత్వం అధికారంలోకి వచ్చింది. భావజాలపరంగా భిన్న భావజాలాలున్న కమ్యూనిస్టు పార్టీ, జార్జ్ ఫెర్నాండెజ్, జగ్జీవన్‌రాం, మొరార్జీ దేశాయ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, ఆడ్వాణీ... ఈ సమిష్టి నాయకత్వంలో భాగం. ఇంత వైవిధ్యమైన, వైరుధ్యమైన సంకీర్ణ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవలేకపోయింది. ఎన్నికలలో ప్రజలు అంత పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినా, అంత ప్రజాబలం ఉన్నా జనతా పార్టీ కూలిపోవడం వెనుక ఓట్ల రాజకీయాల కంటే భిన్న ప్రయోజనాల మధ్య వైరుధ్యాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నదన్నది ఒక వాస్తవ అనుభవంలోకి వచ్చింది. ఇందిరాగాంధీ రెండవసారి గెలిచినప్పుడు ఆమె రాజకీయ పరిభాషలో చాలా మార్పు వచ్చింది. ప్రధానంగా ఆమె పేదల గురించి మాట్లాడడం చాలావరకు తగ్గించింది. భిన్న వర్గాల మధ్య వైరుధ్యాలు ఎక్కడికి దారితీస్తాయో అన్న అనుమానంతో 'దేశ సమగ్రత, సమైక్యత' అనే నినాదాన్ని ముందుకు తీసుకువచ్చింది. దీంతో బాటు తన సోషలిస్టు భావజాలం స్థానంలో పెట్టుబడిదారీ మార్గమే ఏకైక మార్గం అనే నిర్ణయానికి రావడం, ఆమె హత్యానంతరం రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి కావడంతో రాజ్యాంగంలోని సోషలిస్టు భావజాలం గురించి మాట్లాడడం దాదాపు రద్దైపోయింది. పెట్టుబడిదారీ పంథా నియో లిబరలిజం అవతారం తీసుకోవడంతో దానికుండే కొన్ని కనీస ప్రమాణాలు-- ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడం, ధనప్రవాహం నిరోధించడం, రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడడం, విశ్వవిద్యాలయాలు సృజనాత్మక సంస్థలుగా పనిచేయడం-- లాంటివి కూడా పాటించలేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల రాజకీయాల స్వభావమే మారిపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజాస్వామ్యం అనే భావనను విస్తృతంగా ఉపయోగించి పెరుగుతున్న సంపదకు ఒక గౌరవాన్ని కలిగించే ప్రయత్నం చేస్తుంది. కొంతవరకు ప్రజల మద్దతును కూడగడుతుంది. నియో లిబరలిజానికి ఆ అవసరం కూడా లేకుండా పోయింది. రాజ్య స్వభావమే చాలా మార్పునకు గురయింది. సంపద జగన్నాథ రథచక్రాల లాగా ముందుకు పోతున్నది. ఇందిరాగాంధీ 1970లలో అప్పటి వైరుధ్యాల వల్ల రాజ్యాంగాన్ని తాత్కాలికంగా పక్కకు పెడితే, అప్పటి ప్రతిపక్షాలు పోరాడాయి. కాని కలిసి పనిచేయలేకపోయాయి. కనీసం జనతాపార్టీ కొంతకాలం అయినా అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు అప్పటి సంక్షోభం కంటే తీవ్రమైనదైనా ప్రతిపక్షాలు కలిసే ప్రయత్నమే ముందుకు సాగడం లేదు. కలిసి ఎన్నికలలో పోటీచేయడం సాధ్యమే కావడం లేదు. వీటిని కలపడానికి ఒక జయప్రకాశ్ నారాయణ్ వంటి నాయకుడెవ్వరూ లేరు. ఎన్నికలు సారంలోనే కాదు రూపంలో కూడా మారిపోయాయి. ఎన్నికలే ప్రజాస్వామ్యం కాదు. అవి ప్రజాస్వామ్యంలో ఒక భాగం. నిజమైన ప్రజాస్వామ్యం ప్రజాచైతన్య స్థాయిని బట్టి, నిరంతర జాగరూకతను బట్టి, సమస్యలకు సమిష్టిగా స్పందించే ఒక సజీవ పౌరసమాజం మీద ఆధారపడి ఉంటాయి. రాజ్యాంగాన్ని, ఎన్నికల వ్యవస్థని, ప్రజాస్వామ్యాన్ని ఒక మానవీయ సమసమాజ స్వప్నాన్ని కాపాడుకోవడం ఇప్పుడు చాలా అవసరం.

## తితిదే ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.1.51 కోట్ల విరాళం

మొదటిపేజీ తరువాయి

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టులకు భారీ విరాళం అందింది. రిలయన్స్ సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ గురువారం దేవస్థానానికి సంబంధించిన శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.1.51 కోట్ల విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ పేష్కార్ రామకృష్ణకు విరాళం డీడీని అందజేశారు.

## చివరిగింజ వరకు కొంటాం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.

## కెటిఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషన్ భేటీ

మొదటిపేజీ తరువాయి

తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ప్రస్తావించారు.

పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కేటీఆర్‌తో ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై మాట్లాడారు. తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా తీసుకునే చర్యలపై చర్చించారు. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీపై సంతోషం వ్యక్తం చేశారు కేటీఆర్. ఈ భాగస్వామ్యం ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకం

**తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు**

**మహిళా శక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆదేశంపై స్పందించిన సింగరేణి**

**వివిధ క్లిష్టతర బాధ్యతల నిర్వహణపై మహిళలకు అవకాశాలు**

**హెవీ మోటార్ వెహికిల్ శిక్షణను పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు**

మొదటిపేజీ తరువాయి

మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యనిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తికి తగు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని ఆదేశించడంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా కొందరు మహిళలకు కంపెనీ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశంపై సింగరేణి యాజమాన్యం మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం మగ ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్ లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి, పైగా మండే ఎండల్లోనూ, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకొని మూడు షిఫ్టుల్లో కూడా డంపర్లు నడపాల్సి ఉంటుంది. ఇంత కష్టతరమైన పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి తగు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను కోరింది. మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్)అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది. ÷క్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకల్లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా ఆ దిశగా కీలక అడుగులు వేస్తోంది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో మహిళలకు సైతం ప్రాధాన్యతనిస్తూ సింగరేణి సంస్థ తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించటానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది, ఈ విధంగా అనతి కాలంలోనే సింగరేణి సంస్థలో భారీ డంపర్లపై మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కనపడే అవకాశం ఉంది. సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ, భారీ డంపర్లను నడపడం శారీరక కష్టం, నైపుణ్యంతో కూడుకున్న పని అని, తాము చేయగలమో లేదో అని కొంత భయపడినప్పటికీ,

స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇటువంటి పనులు

## మూడో దశ ఎస్ఐఆర్.. ఏపీ, తెలంగాణలో ఎప్పుడంటే..?

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: మూడో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసింది. ఏపీ, తెలంగాణతో పాటు 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ నిర్వహించనుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, ఝార్ఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, సిక్కిం, ఉత్తరాఖండ్, త్రిపుర ఉన్నాయి. ఈ దశలో 3.94 లక్షల మందికిపైగా బూత్ స్థాయి అధికారులు.. 36.73 కోట్ల మంది ఓటర్ల వద్దకు వెళ్లనున్నారు. డిసెంబర్ 23న త్రిపురతో మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియనుంది. ఎస్ఐఆర్‌కు సహకరించాలని అన్ని రాజకీయ పార్టీలకు ఈసీ విజ్ఞప్తి చేసింది. ఏపీలో జూన్ 5 నుంచి 14 వరకు ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. అదే నెల 15 నుంచి జులై 14 వరకు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించనున్నారు. అనంతరం జులై 21న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తారు. జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

తెలంగాణలో జూన్ 15 నుంచి 24 వరకు సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటి సర్వే చేపడతారు. అనంతరం జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించి.. అదే రోజు నుంచి సెప్టెబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు.

## ఎన్నికల అనంతరం హింసపై విచారణ..

మొదటిపేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నల్ల కోటు ధరించి.. కలకత్తా హైకోర్టుకు వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో చోటు చేసుకున్న హింసాత్మక ఘర్షణల కు సంబంధించిన కేసుపై ఆమె స్వయంగా వాదనలు వినిపించనున్నారు. తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది అయిన కల్యాణ్ బందోపాధ్యాయ్ కుమారుడు శిర్షన్య ఈ పిటిషన్ దాఖలు చేశారు.

మమత నల్ల కోటు ధరిస్తూ.. కోర్టుకు వస్తున్న దృశ్యాలను తృణమూల్ కాంగ్రెస్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇది ఆమె నిబద్ధతకు నిదర్శనంగా అభివర్ణించింది. 'బెంగాల్ ప్రజలకు అవసరమైన సమయంలో ఎప్పుడూ మమత వారికి అండగా నిలుస్తారు. సత్యం, న్యాయం, రాజ్యాంగ విలువల కోసం తన పోరాటానికి కట్టుబడి ఉంటారు. ద్వేషపూరిత రాజకీయాలకు అతీతంగా నిలుస్తారు. కరుణ, ధైర్యం, దృఢ విశ్వాసాన్ని ఆమె ప్రదర్శిస్తున్నారు. అన్యాయమైన సర్‌తో పాటు భాజపా అనాగరిక ప్రవర్తను ఆమె బలంగా వ్యతిరేకిస్తారు' అని ఆ పోస్టులో రాసుకొచ్చింది. కాగా.. ఎన్నికలకు ముందు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విచారణలో భాగంగా దీదీ సుప్రీం కోర్టులో స్వయంగా వాదనలు వినిపించిన సంగతి

## మెట్రోలో ప్రయాణించిన ఉబర్ సీఈఓ..

మొదటిపేజీ తరువాయి

మోదీ జాకెట్ ధరించి.. ఒక సాధారణ ప్రయాణికుడిలా ఖోస్రోషాహి మెట్రోలో ప్రయాణించారు. 'లక్షలాది మంది ప్రజలు తమ రోజువారీ విధులకు వెళ్లేందుకు ఈ మెట్రోను ఉపయోగిస్తున్నారు' అని ఆయన అన్నారు. ఉబర్ యాప్ ద్వారా మెట్రో టికెట్ బుక్ చేసుకుని తన ప్రయాణాన్ని పూర్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రయాణం ఎంతో సాఫీగా, సమర్థవంతంగా సాగిందన్నారు. సాధారణ ప్రజలకు ఇది అందుబాటు ధరలో ఉందని, నమ్మదగినదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఉబర్ కేవలం కార్ రైడ్‌లకే పరిమితం కాదన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటో, బస్సులు, మెట్రో వ్యవస్థలతో సహా అన్ని రవాణా మార్గాలను ఒకే ప్లాట్‌ఫామ్ పైకి తీసుకురావడమే తమ కంపెనీ లక్ష్యమన్నారు. భారత్‌లోని ప్రజా రవాణా వ్యవస్థలతో ఉబర్ తన భాగస్వామ్యాన్ని పెంచుకుంటుందన్నారు. దేశవ్యాప్తంగా తమ యాప్ ద్వారా కోటికి పైగా మెట్రో రైడ్‌లు బుక్ అయ్యాయన్నారు.

అమరావతి: జడ్ కేటగిరి భద్రతలో ఉన్న మంత్రి నారా లోకేశ్ (ఛీుతీు ాశీఎవంష్ట్ర) తన వాహనశ్రేణిని కుదించుకోవాలని నిర్ణయించారు. కాన్వాయ్‌ని సగానికి కుదించాలని భద్రతా సిబ్బందికి ఆదేశాలిచ్చారు. దీంతో లోకేశ్ కాన్వాయ్ రెండు వాహనాలకే పరిమితం కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భద్రతలో ఉన్న లోకేశ్‌కు నిబంధనల ప్రకారం తగినన్ని వాహనాలు ఉండాలి. అయినా, తన కాన్వాయ్‌ని తగ్గించాలని ఆదేశించారు.

## వాహనశ్రేణి కుదించుకోవాలని

మొదటిపేజీ తరువాయి

ఒక్కో వాహనంలోనే వచ్చిన మంత్రులు

సీఎం క్యాంపు కార్యాలయంలో లోకేశ్‌తో అల్పాహార విందుకు పలువురు మంత్రులు హాజరయ్యారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఎస్కార్ట్ వాహనం కూడా లేకుండానే అక్కడి వచ్చారు. మంత్రులు అనిత, సంధ్యారాణి, సవిత, కొల్లు రవీంద్ర, పార్థసారథి, మండిపల్లి, డీఎస్‌బీవీ స్వామి, పయ్యావుల కేశవ్ తదితరులు ఎస్కార్ట్ కాకుండా ఒక్కో వాహనంలోనే చేరుకున్నారు.

## పెళ్లిదండలతోనే నవ వధువు మృతి..

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం: పెళ్లి సందడితో కళకళలాడిన ఆ కుటుంబాల్లో ఒక్కసారిగా తీవ్ర విషాదం నెలకొంది. విశాఖలోని అగనంపూడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతిచెందింది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అగనంపూడి ప్రాంతానికి చెందిన నరసింగరావుకు వాడచీపురుపల్లికి చెందిన రామేశ్వరితో బుధవారం రాత్రి వివాహమైంది. వాడచీపురుపల్లిలోని వధువు ఇంట్లో పెళ్లి జరిగింది. గురువారం మధ్యాహ్నం వరుడి ఇంటికి నూతన దంపతులు బయల్దేరారు. ఈ క్రమంలో అగనంపూడి సమీపంలో కారు అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వధువు రామేశ్వరి మృతిచెందగా.. వరుడు నరసింగరావుతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పెళ్లిదండలతో ఉండగానే వధువు మృతిచెందడం స్థానికులను కలచివేసింది. ఈ ప్రమాదం ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# టీజీఎస్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్, సభ్యుల శ్రీ భీమేశ్వర స్వామివారి దర్శనం




వేములవాడ, మే 15, మేకార్తి దినపత్రిక ప్రతినిధి :

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మర్రిపల్లి చందన ,వందన గౌడ్, బండి అపర్ణ, వచన్ కుమార్ రెడ్డి, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్ పాల్గొన్నారు.ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర్ శర్మ వారికి లడ్డూ ప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ జి. అశోక్ , ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ , వి. వెంకట ప్రసాద్ , ఆలయ ఉద్యోగులు మరియు వేద పండితులు పాల్గొన్నారు

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతిప్రణాళికలో భాగంగా ఘనంగా లైబ్రరీలో గ్రంథాలయ దినోత్సవం

- ప్రొఫెసర్ ప్రిన్సిపల్. వి విజయలక్ష్మి ఆధ్వర్యంలో

మేకార్తి దినపత్రిక మే 15 గంభీరావుపేట మండల రిపోర్టర్




రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట డిగ్రీ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక విద్య వారోత్సవాలు ఈరోజు గంభీరావుపేట బ్రాంచ్ లైబ్రరీలో గ్రంథాలయ దినోత్సవ ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి గారు మరియు కే శ్రీనివాస్ రికార్డ్ అసిస్టెంట్ లైబ్రరీ గ్రంథాలయంలో చదువుకొని జాబ్ సంపాదించిన వారు శ్రీ దేవ్యశ ఏఈడబ్ల్యూ. శ్రీ రవి ఎస్ జి టి. తిరుపతి స్కూల్ అసిస్టెంట్ వీరికి సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది గ్రంథపాటకులు పాల్గొని విజయవంతం చేసినారు

# ఐకెపి సెంటర్లో చల్లని మజ్జిగ పంపిణీ చేసిన అంబేద్కర్ సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు బండ రమేష్



మేకార్తి దినపత్రిక మే 15 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తాపానగర్ గ్రామంలో శుక్రవారం ఐకెపి వడ్ల కొనుగోలు సెంటర్లో. హమాలీలకు మరియు రైతులకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలిగించేందుకు చల్లని మజ్జిగ పాకిట్లను ఉచితంగా 20 మంది హమాలీలకు మరియు 30మంది రైతులకు అంబేద్కర్ సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు బండ రమేష్ అందజేశారు రమేష్ మాట్లాడుతూ ఎండ త్రీవంగా ఉన్నది కాబట్టి ఉదయమే ఆరు గంటల వరకు కల్లాలకు రావాలని కాంట పెట్టాలని మరియు 11 గంటల వరకు ఇంటికి వెళ్లాలని మరియు సాయంత్రం ఐదు గంటల నుండి 7 గంటల వరకు పనిచేయాలని ఆయన కోరారు

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యా వారోత్సవాల కింద రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవం

మేకార్తి దినపత్రిక మే -15 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

విద్యార్థులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు విద్యా వారోత్సవాల కింద రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. లైబ్రరీ లో చదివి ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించారు.

ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పుస్తక ప్రదర్శన, మానసిక ఉల్లాసానికి అందుబాటులో ఉంచిన వివిధ ఆటల పరికరాలను పరిశీలించి.. విద్యార్థులు ఈ పుస్తకాలు, ఆటల పరికరాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆద్వర్యంలో డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు.మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని సూచించారు. కోడి గుడ్లు, బాలామృతం, ఇక్రిశాట్ వారి సూచనల మేరకు రూపొందించిన స్నాక్స్, పాలు పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చాలా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. లైబ్రరీ అనేది చదువుకునేందుకు మంచి అవకాశమని, మిగతా వారితో పోటీ పడే స్ఫూర్తి పొందుతారని పేర్కొన్నారు. తాను కూడా లైబ్రరీలో చదివానని గుర్తు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులు వార్త పత్రికలు చదవాలని సూచించారు. దీంతో అన్ని విషయాలపై అవగాహన వస్తుందని వివరించారు. సమయం చాలా విలువైందని, సోషల్ మీడియా కు దూరంగా ఉంటూ లక్ష్య సాధన పై దృష్టి సారించాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని, ప్రతి సబ్జెక్ట్ కు నిర్ణీత గడువు పెట్టుకొని చదవాలని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా కొలువు



సాధించాలని ఆకాంక్షించారు. స్కూల్ వెళ్ళే విద్యార్థులు లైబ్రరీకి వచ్చేలా వివరించాలని పేర్కొన్నారు. వచ్చే వారం యూత్ అండ్ పర్యాటక శాఖ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక వాకథాన్, జాబ్ మేళా నిర్వహించ నున్నామని వెల్లడించారు. యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు.కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో పరిశీలన జిల్లా కేంద్ర గ్రంథాలయంలో టాస్క్ ఆద్వర్యంలో కొనసాగుతున్న కంప్యూటర్ శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు వస్తున్నారు? ఏ ఏ అంశాలు నేర్చుకుంటున్నారో ఆరా తీశారు. తరగతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కృషితో గ్రంథాలయాలను అభివృద్ధి బాటలో తీసుకు వెళుతున్నామని తెలిపారు. గ్రంథాలయంలో చదువుకొని దాదాపు 150 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. చాలా గ్రామాల్లో పబ్లిక్ రీడింగ్ రూమ్ లను ఏర్పాటు చేసి గ్రామీణ పాఠకులకు గ్రంథాలయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపు, అన్ లోడింగ్ వేగవంతం చేయాలి : అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

- ఇల్లంతకుంట, బోయినిపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

మేకార్తి దినపత్రిక మే 15 ఇల్లంతకుంట/ బోయినిపల్లి/ ఎల్లారెడ్డిపేట,

కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించడం, మిల్లుల్లో ఉన్న వాహనాలు అన్ లోడింగ్ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. శుక్రవారం ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి గ్రామంలోని రాజరాజేశ్వర రైస్ మిల్, రహీంఖాన్ పేట గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం, పొత్తూరు, బోయినిపల్లి మండలం మాన్వాడ, కొదురుపాక, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, రైస్ మిల్లుల యజమానులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించి తూకం వేసిన బస్తాలను వాహనాల ద్వారా మిల్లులకు వేగవంతంగా తరలించాలని, సంబంధిత కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చి ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకుని సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. అందుబాటులో నిరుపయోగంగా ఉన్న గోదాములు వినియోగంలోకి తీసుకువచ్చి ధాన్యం నిల్వ



చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా మిల్లుల్లో హమాలీల సంఖ్య పెంచుకుని వాహనాల్లోని ధాన్యం బస్తాలను వేగంగా అన్ లోడింగ్ చేయాలని సూచించారు. మిల్లులను పర్యవేక్షించడానికి కేటాయించిన సిబ్బంది అన్ లోడింగ్ లో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.తనిఖీలో ఇల్లంతకుంట, బోయినిపల్లి, ఎల్లారెడ్డిపేట తహసీల్దార్లు సురేష్, షరీఫుద్దీన్, సుజాత, తదితరులు ఉన్నారు.

# బండి సంజయ్ కొడుకును వెంటనే అరెస్టు చేయాలి ముశం రమేష్ సీపీఎం జిల్లా కార్యదర్శి

మేకార్తి దినపత్రిక మే15 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేంద్ర హోమ్ శాఖా సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ము శం రమేష్ మాట్లాడుతూ భగీరథ్ పై ఫోక్సో కేసు నమోదు అయినప్పటికీ రాజకీయ వత్తిడికి పోలీసులు లొంగి అరెస్టు చేయడం లేదని అన్నారు. భాద్యత కలిగిన స్థానంలో ఉన్న మంత్రి బండి సంజయ్ చట్టంపై గౌరవం ఉంచి తన కొడుకును అప్పగించాలని డిమాండ్ చేశారు. పైగా మంత్రి బండి సంజయ్ బెదిరింపులకు పాల్పడ డాన్ని చూస్తే కేసును తారుమారు చేసే ప్రయత్నం జరుగుతుందని భావించారు.కొత్త పార్టీ పెట్టిన కవిత మాటలు భగీరత్ ను వెనుకేసు కోచ్చేవిధంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యాచార కేసులపై కఠినంగా ఉండాలని అన్నారు. అత్యాచార సంఘటనల పట్ల బీజేపీ ద్వంద విధానాన్ని అనుసరిస్తుందని, మోడీ పాలనలో మహిళలకు భద్రత కొరవడిందని వెంటనే బండి భగీరథ్ ను అరెస్టు చేయకపోతే ఉద్యమం ఉధృతం అవుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా



కార్యదర్శి వర్గ సభ్యులు. జవ్వాజి విమల. కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు. ఎర్రవెల్లి నాగరాజు.సూరం పద్మ గురజాల శ్రీధర్. అన్నదాస్ గణేష్ ఎలిగేటి రాజశేఖర్ . సిరిమల సత్యం. ఆడెపు రజిత. బెజిగం సురేష్. సర్గం శేఖర్ కందుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# రూ. 80 లక్షలతో వైకుంఠ ధామానికి రక్షణ గోడ.. స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

**- ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడ రూపురేఖలు మారుస్తాం: పుల్కం రాజు**

**- పట్టణ ప్రగతిలో ప్రజలంతా భాగస్వాములు కావాలి..**

వేములవాడ, మే 15, మేకార్తి దినపత్రిక ప్రతినిధి

వేములవాడ పట్టణంలోని ఎల్లమ్మ దేవస్థానం ప్రాంతంలో గల స్వజాల బావి ప్రక్కన వైకుంఠ ధామానికి 80 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న వైకుంఠ ధామం (స్మశాన వాటిక) కాంపౌండ్ వాల్ నిర్మాణ స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్థానిక కౌన్సిలర్ మరియు అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల లభ్యతను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతిలో ప్రజలు, మున్సిపల్ యంత్రాంగం భాగస్వాములు కావాలని, అభివృద్ధి పనులకు అందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. స్థల పరిశీలన అనంతరం పుల్కం రాజు మున్సిపల్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా మాట్లాడారు. వేములవాడ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులతో పాటు స్థానిక పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రస్తుత పాలకమండలి పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ, అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా మెరుగుపరచడం వంటి అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా నాలుగో వార్డులో సుమారు 80 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ పనులను ఎలాంటి అలసత్వం లేకుండా, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని, రాబోయే రోజుల్లో వేములవాడ రూపురేఖలు మారబోతున్నాయని చెప్పారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, ఆయన నాయకత్వంలో పట్టణానికి మరిన్ని నిధులు తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పుల్కం రాజు తెలిపారు. వార్డుల వారీగా ప్రజల నుంచి వస్తున్న



వినతులను పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని, ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పనులు జరగాలని సూచించారు. ప్రజలు కూడా తమ వార్డుల్లో జరుగుతున్న పనులను గమనిస్తూ, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పుల్కం రాజు ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, స్థానిక కౌన్సిలర్లు తోటరాజు, కొండ రాజశేఖర్, మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ సంపత్ రెడ్డి, మున్సిపల్ వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

**- బాల్య వివాహాలతో జరిగే ఇబ్బందులపై అవగాహన కల్పించాలి**

**- బాల కార్మిక వ్యవస్థ ఉండవద్దు**

**- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి**

**- బాలల హక్కుల పరిరక్షణపై రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సర్పంచులు, మున్సిపల్ వార్డ్ సభ్యులు, అంగన్వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం**

**- పాల్గొన్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే**



మేకార్తి దినపత్రిక,మే -15 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యతని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్త్రీ, మహిళా, శిశు, వృద్ధుల, దివ్యాంగుల, ట్రాన్స్ జెండర్స్ ల సంక్షేమ శాఖ ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్ లో బాలల హక్కుల పరిరక్షణపై రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సర్పంచులు, మున్సిపల్ వార్డ్ సభ్యులు, అంగన్వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు వచన్ కుమార్ రెడ్డి, బండి అపర్ణ, మర్రిపల్లి చందన, గోగుల సరిత, వందన గౌడ్, ప్రేమలత అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లల రక్షణ.. సమాజం బాధ్యత టోల్ ఫ్రీ నంబర్లతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కిశోర బాలికలకు శిక్షణ ఇచ్చేందుకు కుట్టు మిషన్ అందజేశారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల్లో బాలల హక్కుల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని, బాల్య వివాహాలతో కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలు అడ్డుకోవాలని సూచించారు. పాఠశాలల్లో డ్రాప్ ఔట్లు ఉండవద్దని, ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో సౌకర్యాలపై వివరించి.. ప్రవేశం కల్పించాలని ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థ ఉండవద్దని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ అభివృద్ధితోపాటు ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసి.. బాలల స్థితిగతులు, ఇబ్బందులు గుర్తించాలని సూచించారు. 1098 హెల్ప్ లైన్ వినియోగించుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పిల్లలకు వ్యాక్సిన్లు ఇప్పించాలని సూచించారు. బాలలే దేశ భవిష్యత్ అని, అందరి సహకారంతోనే ప్రతి సామాజిక రుగ్మతలోని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. మగ, ఆడపిల్లల ఇద్దరం సమానమని స్పష్టం చేశారు. ప్రతి వివాహం నమోదు కావాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలపై వివరించాలని తెలిపారు. ఆరు ఏండ్లలోపు పిల్లలు చేర్పించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాల బాలికలకు అవగాహన కల్పించాలని, చదువుతోనే సామాజిక. ఆర్థిక మార్పు సాధ్యమని తెలిపారు.

ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..18 ఏండ్ల లోపు బాల, బాలికలను కమిటీలు సంరక్షించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. జిల్లాలో 100కు పైగా అంగన్వాడీ ల భవనాలు నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. బాలలపై వేధింపులు, బాల్య వివాహాలు నిరోధించాలని ఆదేశించారు. సర్పంచులు అంగన్వాడి కేంద్రాలు, స్కూల్స్ లో సందర్శించాలని సూచించారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమంతోపాటు చిన్నారులు హక్కుల రక్షణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు నిరోధానికి ప్రభుత్వ అనేక పథకాలు అమలు చేస్తుందని వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రానున్నాయని, గ్రామాల్లో పిల్లల స్కూల్స్ నుంచి డ్రాప్ ఔట్ కావద్దని తెలిపారు.విద్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, డైట్ చార్జీలు 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలు పెంచిందని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. ప్రతి గ్రామంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, సర్పంచులు, కార్యదర్శులు బాలల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు వేగంగా ధాన్యం కొనుగోళ్లు జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగంగా కొనుగోలు చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొంటామని స్పష్టం చేశారు. ధాన్యం తరలింపునకు లారీలు, ట్రాక్టర్లు, వ్యాన్లు అందుబాటులో పెట్టామని, ఇప్పటి వరకు 40 శాతానికి పైగా కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలో కార్మిక... ధార్మిక క్షేత్రం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, జిల్లాలో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డ్ ల్లో బాలల హక్కుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని తెలిపారు. అనాథలకు ప్రభుత్వం ప్రతి నెలా మిషన్ వాత్సల్య కింద ప్రతి నెలా రూ.4000 సహాయం అందిస్తుందని, జిల్లాలో 117 మంది పిల్లలకు ప్రతి నెలా పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఇంకా ఎవరైనా ఉంటే తమ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలను దత్తత కూడా చట్ట ప్రకారం తీసుకోవాలని, ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం ఇస్తున్నారా లేదా పరిశీలించాలని, ప్రతి వారంలో ఒక రోజు పంచాయతీ కార్యదర్శి పిల్లలతో కలిసి భోజనం చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ బాలల హక్కుల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ కోసం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్మిక శాఖ అధికారులతో కలిసి ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించి.. బాల కార్మికులకు విముక్తి కల్పించామని తెలిపారు. షి టీమ్ లు ఏర్పాటు చేసి.. మహిళల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూపారెడ్డి, రాములు నాయక్, రాజు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల ఆర్డీఓ రాజేందర్ రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

# - డిఆర్డిఓ జయదేవ్ ఆర్య

**వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని కోరిన సర్పంచ్ అక్కెనపల్లి రాజలక్ష్మి మల్లారెడ్డి**

మేకార్తి దినపత్రిక మే 15 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామాన్ని డిఆర్డిఓ జయదేవ్ ఆర్య ఉపాధి హామీ పనుల పరిశీలన నిమిత్తం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి, కూలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తెలిపారు.ఉపాధి హామీ ద్వారా ఎక్కువ మందికి ఉపాధి కల్పించి, వారికి సకాలంలో చెల్లింపులు జరిగితే, అందులో 60 శాతం నిధులు గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తుందని, వాటిని సీసీ రోడ్లు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.అనంతరం వడ్ల మార్కెట్ యార్డును సందర్శించగా గ్రామ సర్పంచ్ అక్కెనపల్లి రాజ్యలక్ష్మి మల్లారెడ్డి వడ్ల కొనుగోలు కేంద్రంలో ఉన్న ఒక జల్లి మిషన్ గత 10 రోజులుగా పనిచేయకపోవడం గురించి మరియు వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన డిఆర్డిఓ సాయంత్రం లోపు మోటర్ మార్చి మిషన్‌ను సరిచేయాలని, లేకపోతే కొత్త మిషన్ కొనుగోలు చేయాలని, వడ్లు పట్టే యంత్రాలు మరియు ఇతర సదుపాయాలు సక్రమంగా పనిచేసేలా చూసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఐకెపి సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కొమురవెల్లి ఎంపీడీవో బండి లక్ష్మప్ప , ఫీల్డ్ ఆఫీసర్ లింగం రామ్‌సాగర్ గ్రామ సర్పంచ్ అక్కెనపల్లి రాజ్యలక్ష్మి మల్లారెడ్డి ఉప సర్పంచ్ మల్లారెడ్డి, నాయకులు ప్రవీణ్ రెడ్డి, సంపత్ రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, ఐకెపి సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రింట్ మీడియా. ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులకు సన్మానం

**ప్రొఫెసర్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో**

మేకార్తి దినపత్రిక మే 15 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఈరోజు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో విద్యా వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీమతి విజయలక్ష్మి గారి అధ్యక్షన అనంతరం పాత్రికేయ మిత్రుల సమావేశ కార్యక్రమం నిర్వహించి తమ కళాశాల కార్యక్రమాల గురించి సౌకర్యాల గురించి తెలియజేస్తూ ప్రతిరోజు పత్రిక రూపంలో వివరిస్తున్న అందరి పాత్రికేయుల కృషిని అభినందిస్తూ అందుబాటులో ఉన్న అందరి పాత్రికేయులను శాలువతో సత్కరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. ఎం ప్రభాకర్, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్. వై. ఆంజనేయులు, ఎన్ ఎస్ ఎస్ పి ఓ పాక ధర్మపురి, టి ఏ ఎస్ కె కోఆర్డినేటర్ డాక్టర్ జె. శ్రావణ్, స్కాలర్షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ ఆదివిష్ణువు, డబ్ల్యూ ఈ సి కోఆర్డినేటర్ వి. వాణి, డాక్టర్ కె.వి. బిక్షమయ్య,మనోహర్, శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, మహేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, శంకర్ తదితర అధ్యాపకులు అధ్యాపకేతర బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# 12 సిసి కెమెరాలను ప్రారంభించిన ఏసిపి సదానందం.

మేకార్తి దినపత్రిక మే 15 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



సీపీ ఆదేశాల మేరకు సిద్ధిపేట సురక్ష నేత్ర లో భాగంగా చేర్యాల మండలంలోని వీరన్నపేట మరియు గుర్జకుంట గ్రామాల్లో ఊరికి ఆరు చొప్పున మొత్తం 12 సీసీ కెమెరాలను ఏసిపి హుస్నాబాద్ ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యత , రోడ్డు భద్రత, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు, వంటి వాటి మీద రెండు గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించననినది. దీన్ని ఉద్దేశించి ప్రతి గ్రామం మరియు వార్డు లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి అని అన్నారు.

## గన్నేరువరం మండల కేంద్రంలో నూతన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్ కి ఘన సన్మానం



మేకార్తి దినపత్రిక (మే 15) గన్నేరువరం మండల ప్రతినిధి

గన్నేరువరం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా నియామకమైన గన్నేరువరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు సునీల్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కే డి సి సి బ్యాంక్ జిల్లా డైరెక్టర్ అల్వాల కోటి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, చొక్కారావుపల్లె సర్పంచ్ గోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాతంగి అనిల్, మాజీ ఉపసర్పంచ్ సంపత్ రెడ్డి, బూర వెంకటేశ్వర్లు, పాకాల పరశురాం, బుర్ర మల్లేశం గౌడ్, తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్, తాళ్లపల్లి రవికుమార్ గౌడ్, దొగ్గలి ప్రదీప్, వివిధ గ్రామాల సర్పంచులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ పోలీస్ పోటీలలో సత్తా చాటిన ఏసిపి మాధవి

**- అఖిల భారత పోలీస్ క్రీడా పోటీలలో హుజూరాబాద్ ఏసీపీ మాధవి అద్భుత ప్రతిభ**

**- టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పతకాల పంటలి**

**- జాతీయ స్థాయిలో కరీంనగర్ పోలీస్ కీర్తిని చాటిన హుజూరాబాద్ ఏసీపీ మాధవి మేడం**

మేకార్తి దినపత్రిక మే 15 ప్రతినిధి



ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో ఈనెల 9వ తేదీ నుండి 13వ తేదీ (09.05.2026 నుండి 13.05.2026) వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "అఖిల భారత పోలీస్ క్రీడా పోటీల" (ూశ్రీశ్రీ ×అఎఋ ్రాశీశ్రీఅషెవ +ఋఎవం) లో కరీంనగర్ జిల్లా, హుజూరాబాద్ ఏసీపీ (ూజూ) వి. మాధవి అద్భుత ప్రదర్శనతో రాణించి ఘన విజయం సాధించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన గట్టి పోటీని తట్టుకొని, టేబుల్ టెన్నిస్ మరియు బ్యాడ్మింటన్ విభాగాల్లో ఆమె ఏకంగా నాలుగు పతకాలను కైవసం చేసుకుని రాష్ట్ర పోలీస్ శాఖకు, కరీంనగర్ కమిషనరేట్‌కు కీర్తిని తెచ్చిపెట్టారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవినీ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మరియు సహచర అధికారులు ఘనంగా అభినందించారు.

## ఎల్‌ఓసి మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేకార్తి దినపత్రిక మే 15 ఎల్లారెడ్డి పేట




రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బండ అంజయ్య అనారోగ్యంతో అత్యవసర చికిత్స అవసరమైన విషయం తెలుసుకున్న వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించారు..నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ప్రత్యేక చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం నుండి 1,00,000 రూపాయల విలువ గల ాూజ ను వైద్య ఖర్చుల కోసం వెంటనే మంజూరు చేయించారు.ఈ సహాయం అందించడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలయాలే పునాది .

మేకార్తి దినపత్రిక మే15 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

చేర్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేర్యాలలో విద్యా వారోత్సవాలలో భాగంగా 5 వ రోజు గ్రంథాలయాల వారోత్సవాలు ఘనంగ నిర్వహించడం జరిగినది.నేటి ఆధునిక విద్యా వ్యవస్థలో డిగ్రీ కళాశాల గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు మాత్రమే కాదని, అవి విజ్ఞానాన్ని విరజిమ్మే మేధో కేంద్రాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేర్యాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె ప్రణీత స్పష్టం చేశారు. కళాశాల లైబ్రరీ సౌకర్యాలు మరియు విద్యార్థుల పురోగతిలో వాటి పాత్రపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు.విజ్ఞాన గని - మన గ్రంథాలయం డిగ్రీ స్థాయి విద్యార్థులకు సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు తరగతి గది బోధన ఎంత ముఖ్యమో, లైబ్రరీలో చేసే స్వయం అధ్యయనం అంతకంటే మిన్న అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లైబ్రరీ ద్వారా చేకూరుతున్న ఐదు కీలక ప్రయోజనాలను వివరించారు:

**1. విస్తృతమైన విజ్ఞాన భాండాగారం:**

కళాశాల గ్రంథాలయంలో వేలాది అకడమిక్ పుస్తకాలు, జాతీయ మరియు అంతర్జాతీయ జర్నల్స్ అందుబాటులో ఉన్నాయి. ఇది విద్యార్థులలో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందిస్తుంది.

**2. పోటీ పరీక్షలకు అస్త్రశాల:**

సివిల్స్, గ్రూప్స్, మరియు ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'కాంపిటేటివ్ కార్నర్' ఏర్పాటు చేశామని, ఇక్కడ తాజా కరెంట్ అఫైర్స్, మాగజైన్లు నిరంతరం అందుబాటులో ఉంటాయని తెలిపారు.

**3. డిజిటల్ లైబ్రరీ డ ఈ-లెర్నింగ్:**

మారుతున్న కాలానికి అనుగుణంగా లైబ్రరీని ఆధునీకరించాము. వై-ఫై సదుపాయం, ఈ-బుక్స్ , మరియు 'ఎన్-లిస్ట్' వంటి పోర్టల్స్ ద్వారా విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేలకొద్దీ డిజిటల్ పత్రికలను ఉచితంగా చదువుకోవచ్చు.

**4. ప్రాజెక్ట్ వర్క్స్ మరియు అసైన్‌మెంట్స్:**

ఫైనల్ ఇయర్ విద్యార్థులు తమ ప్రాజెక్ట్ వర్క్స్ పూర్తి చేయడానికి అవసరమైన రిఫరెన్స్ పుస్తకాలు మరియు గత సంవత్సరాల నివేదికలు ఇక్కడ భద్రపరచబడ్డాయి.

**5. వ్యక్తిత్వ వికాసం:**



సాహిత్యం, చరిత్ర, మరియు ప్రముఖుల జీవిత చరిత్రలు చదవడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపడతాయి.గ్రంథాలయ పాలకురాలు ( లైబ్రరీ కోఆర్డినేటర్) ఎన్. రజిని మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి లైబ్రరీ కార్డులు జారీ చేశామని, సెలవు దినాల్లో కూడా విద్యార్థులు చదువుకునేలా ప్రత్యేక రీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. వారం వారం నిర్వహించే 'లైబ్రరీ అవర్'ను విద్యార్థులు విధిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎన్.శ్రీనివాస్ రావు, డా.ఎస్. గంగయ్య, డి .నరేష్ కుమార్, కె.సుదర్శన్, జే.వీరేందర్ లైబ్రరీ సిబ్బంది మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సముద్రాలింగాపూర్ వద్ద ఘోర ప్రమాదం

**- బస్సు, కారు, ద్విచక్ర వాహనం ఢీ..**

మేకార్తి దినపత్రిక మే 15 గంభీరావుపేట మండల రిపోర్టర్

గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ సమీపంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రతిమ విజ్ఞాన విద్యా సంస్థకు చెందిన బస్సు, కారు బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సముద్ర లింగాపూర్ శివారులో ఈ ప్రమాదం సంభవించింది. ఢీకొన్న ధాటికి కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను వాహనం నుండి బయటకు తీసి, చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన






స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల పేరుతో ఏటా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా, ఆచరణలో మాత్రం ఫలితం శూన్యంగా కనిపిస్తోంది. అవగాహన సదస్సులు కేవలం ఫొటోలకేపరిమితమవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల అమలులో అధికారుల పర్యవేక్షణ లోపించడం, వాహనదారుల్లో నిర్లక్ష్యం పెరగడం ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోంది. జిల్లాలో రోజురోజుకూ రోడ్డు ప్రమాదాల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. ముఖ్యంగా యువత అతివేగంతో వాహనాలు నడపడం,హెల్మెట్ధరించకపోవడం, కారులో సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వంటి ఉల్లంఘనలు ప్రాణాల మీదకు తెస్తున్నాయి. వేగం కంటే ప్రాణం మిన్న అనే నిజాన్ని విస్మరించి, ఒక్క క్షణం చేసే నిర్లక్ష్యం ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది.

## బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఐకెపి సెంటర్ల సందర్శన.

వేములవాడ, మే 15, మేకార్తి దినపత్రిక ప్రతినిధి

పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతును రాజు చేద్దాం అని మాటల్లో చెప్పడమే తప్ప రైతుల కష్టాలను పట్టించుకున్న పాపాన పోవడం లేదని మండిపడ్డారు మొన్నటి వరకు కూడా రైస్ మిల్లుల సందర్శన అని లారీలు రెడీ పెట్టినమని పేపర్ ప్రకటనలు ప్రెస్ ప్రకటనలు ఇచ్చిన అధికారులు స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ వైపు గత 15 రోజుల నుంచి ఇక్కడ రైతులు వడ్లు ఆరబోసుకుంటూ ఎదురుచూస్తున్నది కనిపించట్లేదని అన్నారు వెంటనే ఇక్కడ ఉన్న



వడ్లకు సరిపడా లారీలను కూలీలను ఏర్పాటు చేసి లోడింగ్ చేపియాలని అన్నారు అలాగే ఒక్కొక్క రైస్ మిల్ వద్ద అన్ లోడింగ్ లో ఉన్న లారీలను అన్లోడ్ చేపించి రైతులకు మేలు చేయాలని లేదంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని అన్నారు నాయకులు రేగుల శ్రీకాంత్ రేగుల మల్లికార్జున్ కట్కం శ్రీనివాస్ మాటాడుతూ ప్రభుత్వం వెంటనే లారీలను ఏర్పాటు చేసి కొనుకోలు చేయాలని ఫోటోలకు పోజులు ఇస్తూ జిల్లా వ్యాప్తంగా 234 ఐకెపి సెంటర్లు ప్రారంభించిన ఫోజులకు మాత్రమే అన్నట్లు ఉంది అన్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వంగల శ్రీనివాస్ నాయకుల గుడిసె మనోజ్ పిన్నింటి హనుమన్లు ఆకుల దాము అన్నం నరసయ్య రేనీ కింద అశోక్ వాసం మల్లేశం బుర్ర మనీష్ తదితరుల పాల్గొన్నారు

## ఘనంగా గన్నేరువరం మండల కేంద్రంలో

**- మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జన్మదిన వేడుకలు**

**- బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో**

మేకార్తి దినపత్రిక (మే 15) గన్నేరువరం మండల ప్రతినిధి

గన్నేరువరం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జన్మదిన వేడుకలు టపాసులు పేల్చి ఘనంగా జరిగాయి. అనంతరం గంప వెంకన్న కేక్ కట్ చేసి స్వీట్లు పండ్లు వృద్ధులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మానస దేవి దివ్య ఆశీస్సులతో రసమయి బాలకిషన్ గారు ఆయురూ ఆరోగ్యాలతో ఉండాలని మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లెల లక్ష్మణ్ వైస్ ఎంపీపీ న్యాత సుధాకర్, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు, గ్రామ శాఖ అధ్యక్షులు మీసాల ప్రభాకర్, టిఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు కుసుంబా నవీన, కొట్టే భూమయ్య,న్యాల పట్ల శంకర్ గౌడ్, బోయిని



అంజయ్య, సమ్మెట అనిల్, చక్కని పల్లి సత్తయ్య, కిషన్ గౌడ్, బొడ్డు బాలయ్య, వివిధ గ్రామాల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లా ఇందిరమ్మ ఇళ్లపై జరిగిన సమీక్ష

- సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ
- జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం
- గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు



మేకార్తి దినపత్రిక, మే 15 వరంగల్ ప్రతినిధి

జాయింట్ సర్వే తో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం హైదరాబాద్ మే 15 పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మ గౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంతరెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే ప్రక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో (వంద శాతం సబ్సిడీతో) పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణా ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు.

రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో మంత్రిగారు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, మంత్రులు శ్రీమతి దాసరి అనసూయ సీతక్క, శ్రీమతి కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు. 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50 వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా , ఐటిడిఎ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు అదనంగా ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇది ఇంతటితో ఆగిపోదని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు మూడవ, నాలుగవ విడతలుగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇరవై వేల వరకు ప్రభుత్వం నుంచి సహాయం పొందిన వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ పైలట్ గ్రామాల్లో ఆరువందలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇండ్లను నిర్మించిన వారి బిల్లులను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదవాడు తాను నివశిస్తున్న పూరి గుడిసె స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే , తమ ల్యాండ్ అంటూ ఫారెస్ట్ అధికారులు గానీ, సింగరేణి యాజమాన్యం కానీ అడ్డుపడొద్దని చెప్పారు. ఇండ్ల బేస్ మెంట్ కోసం చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే రెవెన్యూ, పోలీసు అడ్డు చెప్పకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి పేదల కోసం భూములను సేకరించి పట్టాలిచ్చారనీ , ఇందులో ఇంకా కొంత భూమి మిగిలే ఉందని దీనిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్ర స్థాయిలోని స్థితిగతులపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోడానికి, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించే చర్యలు తీసుకునే క్రమంలోనే సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల సూచనలకు అనుగుణంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇండ్ల 2 విడత కార్యక్రమంలో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తామన్నారు. ముఖ్యంగా ఈ నెలాఖరుకల్లా వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 2 బిహెచ్ కె ఇండ్లన్నిటికీ లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజీ పడకుండా, పూర్తి పారదర్శకంగా అర్హులైన నిరుపేదలకే లబ్ధి చేకూరేలా చూడాలని స్పష్టం చేసారు. డబుల్ బెడ్ రూం కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలైన విద్యుత్, మంచినీరు, డ్రైనేజి వంటి వాటి పనులను వెంటనే పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న కాలనీల్లో టవర్ ను యూనిట్ గా తీసుకుని , లబ్ధిదారుల అసోసియేషన్ ల ద్వారా పనులు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను వీలైనంత వరకు సమీప ప్రాంతాల్లోనే అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీభూములున్నాయని, రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య చాలా సరిహద్దు వివాదాలు ఉన్నాయని మంత్రి అన్నారు. రెండు విభాగాలు జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. దీంతో పాటు పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్టు మధ్య కూడా వివాదాలు ఉన్నాయని ప్రభుత్వం ఇటీవల కొనుగోలు చేసిన రోవర్స్ తో సర్వే నిర్వహించి భూ వివాదాలకు ముగింపు పలకాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో హౌసింగ్ సెక్రటరీ శ్రీ వి.పి. గౌతం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి శ్రీ రాజీవ్ గాంధీ హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# టీజీఎస్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్, సభ్యుల శ్రీ భీమేశ్వర స్వామివారి దర్శనం



మేకార్తి దినపత్రిక మే 15 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (౧+ూజూజ=) చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మర్రిపల్లి చందన ,వందన గౌడ్, బండి అపర్ణ, వచన్ కుమార్ రెడ్డి, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్ పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర్ శర్మ వారికి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ జి. అశోక్ , ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ , వి. వెంకట ప్రసాద్ , ఆలయ ఉద్యోగులు మరియు వేద పండితులు పాల్గొన్నారు

# 3వ అంగన్వాడి సెంటర్లో పోషక పదార్థాలు అందజేత.



మేకార్తి దినపత్రిక మే 15 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

చేర్యాలలోని 3 వ అంగన్వాడి సెంటర్లో కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి అంగన్వాడి సెంటర్లోని బెన్ఫిషర్లకు గర్భిణీ బాలింతలకు నేలమాసం పోషకపదార్థాలు గుడ్లు , బియ్యం బాలామృతం తదితర పోషక పదార్థాలను అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా బెన్ఫిషర్లకు తప్పకుండా అంగన్వాడి సెంటర్లో కి రోజు మీ పిల్లలను తప్పకుండా తోలుయాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లలు ఎదుగుదలలో పోషకాహారం లోపం లేకుండా అంగన్వాడి సెంటర్లు ఎంత దోహదపడతాయని గర్భిణీ బాలింతలు కూడా అంగన్వాడీ టీచర్ల సూచనలను వినాలని క్రమం తప్పకుండా మీకు వచ్చే పౌష్కారాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. ఎండాకాలం వచ్చినందున ఈ సెలవు దినాల్లో చిన్నపిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎండ వేడిని తట్టుకోవడానికి ప్రతి అరగంట గంటకోసారి నీరు తాగిపించినట్లైతే ఎండ వేడిమి తట్టుకోవడానికి వీలుంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఇమ్మడి రేణుక అంగన్వాడి బెనిఫిషర్లు పాల్గొన్నారు.

# రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో పటిష్ట భద్రత ఏర్పాట్లు.

- సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దు.
- రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించిన ఎస్పీ మహేష్ బి. గితే.

మేకార్తి దినపత్రిక, మే 15 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ....బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లాలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.పశువుల కొనుగోలు,రవాణా,వధ ప్రక్రియల్లో బంధనలు,మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.సంతల్లో కొనుగోలు చేసిన పశు వులకు సంబంధిత పశు వైద్యాధికారులచే జారీ చేసిన ఆరోగ్య ధృవీకరణ పత్రాలు, రవాణా అనుమతి పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు.సరైన పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.ఇతర రాష్ట్రాలు,జిల్లాల నుండి జంతువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తనిఖీల సమయంలో పోలీస్, వెటర్నరీ అధికారులకు సహకరించాలని కోరారు.ఆవులు,దూడలను అక్రమంగా రవాణా చేసిన , నిబంధనలకు విరుద్ధంగా



వధించిన , ప్రజలకు అసౌకర్యం కలిగే విధంగా మాంసం విక్రయాలు నిర్వహించడంలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.అక్రమ పశు వుల రవాణా,నిషేధిత జంతువుల వధ, అనుమతులు లేకుండా స్లాటర్ హౌస్ నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి పశువుల అక్రమ రవాణా, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 8712537826 లేదా నోడల్ అధికారి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ 8712656410 కు సమాచారం అందించాలని సూచించారు.ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, మత పెద్దలు శాంతి, సామరస్యాల పరిరక్షణకు సహకరించాలని కోరారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలను ఉపేక్షించబోమని హెచ్చరించారు.సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాల్లో విద్వేషాలను రెచ్చగొట్టే మార్ఫింగ్ ఫోటోలు, అసత్య ప్రచారాలు, ప్రేరేపిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.సమావేశంలో డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు , ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

మండల అధ్యక్షులు భూశీ పల్లి సురేందర్ రావు



మేకార్తి దినపత్రిక మే 15 ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బొంపెల్లి సురేందర్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు 3 రూపాయలు పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ధరల పెంపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచడం కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిదర్శనమని విమర్శించారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలపై భారం మోపడం సరైంది కాదన్నారు. వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com